# పథకాలు భేష్..

# రుణాలతో జాగ్రత్త

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్‌లకు ప్రశంస

- కానీ.. అప్పులు, వడ్డీల భారం పెరుగుతోంది
- ప్రయోజనాలున్నా అప్రమత్తత అవసరం
- రాష్ట్ర రుణాల మొత్తం 1.42 లక్షల కోట్లు
- సాగునీటి ప్రాజెక్టుల్లో జాప్యం వల్లే వ్యయం తడిసి మోపెడు
- 19 ప్రాజెక్టుల అంచనా వ్యయం 41 వేల కోట్లు
- కానీ పెరిగిన భారం 2 రెట్లకు పైమాటే
- కేటాయింపులు.. ఖర్చులో భారీ వ్యత్యాసం
- ఇలా అయితే ఫలితాల సాధన గగనం
- స్థూలంగా ఆర్థిక మాంద్యం వైపు అడుగులు
- హెచ్ఎండీఏ, మెట్రో వాటర్ వర్క్స్‌లో ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘన
- స్పష్టం చేసిన కాగ్.. అసెంబ్లీకి నివేదిక

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు విశేష ప్రజాదరణ పొందుతున్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రశంసించింది. ముఖ్యంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ పథకాల అమలు పారదర్శకంగా ఉందని తెలిపింది. కొన్ని రంగాల్లో పెట్టుబడుల వ్యయం భారీగా ఉన్నప్పటికీ సమీప భవిష్యత్తులో వాటిద్వారా విస్తృత ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేసింది. అదే సమయంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన అప్పులపై వడ్డీ చెల్లింపుల భారం పెరుగుతోందని, మొత్తం అప్పులు రూ.లక్షా 42వేల కోట్లు ఉన్నట్లు లెక్క తేల్చింది. 2018 మార్చి ముగింపు నాటికి రాష్ట్రంలో ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాలపై ఆదివారం శాసనసభ, శాసనమండలికి కాగ్ నివేదిక సమర్పించింది. కొన్ని అంశాల్లో ప్రభుత్వ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కితాబిచ్చింది. ప్రభుత్వం చెల్లించాల్సిన అప్పు లు రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు (జీఎస్డీపీ) నిష్పత్తిలో 19 శాతంగా ఉన్నట్లు సర్వేలో గుర్తించినట్టు తెలిపింది. ఇది 14వ ఆర్థిక సంఘం నిర్ణయించిన పరిమితి 22.82 శాతానికి లోబడి ఉన్నట్లు స్పష్టం చేసింది.

### ఆదాయంకన్నా వడ్డీ చెల్లింపులే ఎక్కువ

గడిచిన ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్ర ప్రభుత్వ అప్పులు రూ.లక్షా 42వేల కోట్లు ఉన్నట్లు నివేదికలో పేర్కొంది. రెవెన్యూ రాబడితో పోలిస్తే వడ్డీ చెల్లింపులు 12.19 శాతం అధికంగా ఉన్నట్లు తెలిపింది. ప్రతియేటా పెరుగుతున్న వడ్డీ చెల్లింపుల భారంతో కొంత ఆర్థికమాంద్యం నెలకొంటున్నట్లు అభిప్రాయపడింది. వచ్చే మూడేళ్ళలో రాష్ట్రం చెల్లించాల్సిన అప్పులపై వడ్డీ మొత్తం రూ.65,740 కోట్లుగా లెక్కించింది. రెవెన్యూ లోటు రూ.284.74 కోట్లు కాగా, ద్రవ్య లోటు రూ.27,654 కోట్లుగా ఉన్నట్లు కాగ్ నివేదికలో స్పష్టంచేసింది. క్యాపిటల్ వ్య య ంలో తెలంగాణ ప్రభుత్వం ముందం జ లో ఉన్నప్పటికీ కొన్ని రంగాల్లో కేటా యింపుల మేరకు వ్యయం జరగలేదని గుర్తించింది. విద్యారంగానికి కేటా యి ంపుల్లో వెనకబడి ఉన్నట్లు తెలిపింది.

### సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

ప్రభుత్వ నీటి పారుదల రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎక్కువ పెట్టుబడులు పెట్టడం ద్వారా పెద్ద మొత్తంలో నిధుల వ్యయం జరుగుతోందని తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా ఆస్తుల కల్పనపై దృష్టి సారిస్తూ భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు కాగ్ తన నివేదికలో పేర్కొంది. 2014 నుంచి 2018 వరకు మధ్యకాలంలో ప్రాజెక్టులపై మొత్తం రూ.79,236 కోట్లు ఖర్చు చేసినట్లు స్పష్టం చేసింది. ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం కావడంతో అంచనా వ్యయం విపరీతంగా పెరిగినట్లు తేల్చింది. అలాగే విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)ల్లో ఆర్థిక పునరుత్తేజం ఉండాలంటే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని సూచించింది. వైద్య ఆరోగ్యం, సాంఘిక సంక్షేమ శాఖలు పదేపదే కొన్నేళ్ళుగా మిగులు నిధులను చూపిస్తున్నాయని, అందుకు ప్రధాన కారణం ఆయా శాఖల్లో అంచనా ప్రతిపాదనల మేరకు నిధులు ఖర్చు చేయకపోవడమేనని కాగ్ స్పష్టంచేసింది.

### జాప్యంతోనే ఆర్థికభారం

కొన్ని రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టినప్పటికీ లక్ష్యాలు సకాలంలో నెరవేరకపోయిన కారణంగా రాష్ట్ర ఆర్థిక వృద్ధి సాధ్యపడలేదని, అందులో ప్రధాన రంగం సాగునీటి రంగమేనని తెలిపింది. 19 ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.41,021 కోట్లు కాగా, పనుల్లో జాప్యం కారణంగా ఈ వ్యయం రూ.1,32,918 కోట్లకు పెరిగినట్లు సర్వే నివేదికలో వెల్లడించింది. ఈ ప్రాజెక్టులపై రూ.70,758 కోట్లు ఇప్పటి వరకు ఖర్చు చేసినా పూర్తి కాలేదని పేర్కొంది. గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో వ్యయం పెరుగుతున్నందున అప్పులపై ఆధార పడాల్సి వచ్చిందని, ఫలితంగా వడ్డీ చెల్లింపుల భారం ప్రతియేటా అంచనాకు మించి పోతోందని చెప్పింది.

### అప్పులతో తిప్పలే

ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అప్పులు జీఎస్డీపీ వృద్ధిరేటు కన్నా పెరుగుతున్నాయని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని కాగ్ వివరించింది. వైద్య ఆరోగ్య, సాంఘిక సంక్షేమ శాఖల కింద పదేపదే మిగులు నిధులు కనిపిస్తున్నాయని, ప్రతియేటా ఈ రంగాల్లో వ్యయం ఆశాజనకంగా లేదని గుర్తించింది. నిధులు సరిగ్గా ఖర్చు చేయకపోవడం కారణంగా ఆ శాఖల్లో అసమర్థత కనిపిస్తున్నట్లు స్పష్టంచేసింది.

### వ్యయంపై అదుపు అవసరం

శాసనసభ సూచించిన బడ్జెట్ కంటే ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చు చేసినట్టు కాగ్ తన నివేదికలో పేర్కొంది. ఈ విషయాన్ని గుర్తించి కేటాయింపుల మేరకే నిధుల వ్యయం జరిగేలా ప్రభుత్వం జాగ్రత్తలు పాటించాలని సూచించింది. లేదంటే రాష్ట్రంపై ఆర్థికభారం మరింత పెరుగుతుందని, అదే సమయంలో ప్రాధాన్యతా రంగాల్లో ఫలితాల సాధనలో జాప్యం జరుగుతుందని తెలిపింది. స్థూలంగా ఈ అంశాలన్నీ ఆర్థిక మాంద్యానికి దారితీస్తాయని కాగ్ స్పష్టం చేసింది.

### కట్టుతప్పిన జలమండలి

జలమండలి (మెట్రో వాటర్ బోర్డు), హెచ్ఎండీఏలాంటి స్వయం పతిపత్తిగల సంస్థల్లో వార్షిక పద్దులను సమర్పించడంలో జాప్యం జరుగుతోందని కాగ్ ఆక్షేపించింది. ఈ సంస్థల్లో అత్యవసర ఖర్చుల కోసం రూ.280.45 కోట్లు ఖజానా నుంచి వితరణ చేసినప్పటికీ, అందుకు సంబం ధించిన బిల్లులు మాత్రం ప్రభుత్వానికి అందజేయలేదని తప్పుబట్టింది. నిర్దిష్టమైన గడువులోగా బిల్లులు సమర్పించకపోవడం ఆర్థిక క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని కాగ్ నివేదిక స్పష్టంచేసింది.